# వేలం

## కాటూరి రవీంద్ర – త్రివిక్రమ్

"అన్నీ సిద్ధంగా ఉంచావ్ కదూ?" హడావిడిగా ప్రవేశిస్తూ అడిగేడు రామనాథం.

"ఉంచాను సార్" వినయంగా చెప్పాడు బాబూరావ్.

గదిలోకి వెళ్లి స్వయంగా చూశాడు రామనాథం.

మిల మిల మెరుస్తున్న గుండ్రని టేబుల్ మీద రెండు విస్కీసీసాలూ, గ్లాసులూ నిరీక్షణలో ఉన్నాయి.

గదంతా నీట్‌గా, ఎమల్షన్ రంగులు గోడలకి అలంకారాలుగా, తైలవర్ణ చిత్రాల్లో ఉన్న ప్రకృతి దృశ్యాలతో చూడగానే ఆకట్టుకుంటోంది.

నాలు గడుగులు వేసి, 'డోర్ నాబ్' త్రిప్పి, కొద్దిగా తలుపు తెరిచి, అవతలి గదిలోకి తొంగి చూశాడు. శోభనం గదికి 'నమూనా'లా ఉంది. లోపల – డబ్బుకి దొరికే అందం సీరియస్‌గా సినిమా పత్రిక చదువుకుంటూ, రామనాథం రాక గమనించి చప్పున లేవబోయింది. మందహాసంతో వారించి, "బీ కంఫర్ట్‌బుల్" అని మళ్లీ తలుపు దగ్గరగా లాగి ఇవతలికి వచ్చేశాడు.

మళ్లీ నాలుగు మూలలా చూసి, తృప్తిగా నిట్టూర్చాడు.

ఈ మధ్యనే కొన్న ఎలక్ట్రానిక్ వాచ్ అది. సెకన్లతో సహా టైము చూపిస్తుంది.

"టెన్ మినిట్స్, ఫార్టీ సెకండ్స మోర్" తనలో తను గొణుక్కున్నాడు.

ఓ మాటు కిటికీలోంచి వీధిలోకి తొంగి చూశాడు. ట్రాఫిక్ పెద్దగ లేదు.

అస్థిమితంగా గదిలో అటు, యిటు పచార్లు మొదలెట్టాడు.

గది మధ్యలో ఆగి "బాబూరావ్..." అని పిలిచాడు.

బీడీ గిరవాటేసి గబ గబ లోపలికొస్తూ "పిలిచారా సార్?" అనడిగేడు వినయంగా బాబూరావ్.

"అన్నట్టు పొద్దున నేను బయటకెళ్తుంటే ఏదో అడగబోతూ ఆగిపోయావ్... తర్వాత చెప్తానన్నావ్ ఏమిటది?" అన్నాడు గుర్తు చేసుకుంటూ.

బాబూరావ్ ఒక్క క్షణం తబ్బిబ్బయ్యాడు.

"అదీ....అదీ...."

"చెప్పు ఫర్వాలేదు" సిగరెట్‌ని లైటర్‌తో వెలిగించుకుంటూ అడిగేడు రామనాథం

అంతలో టెలిఫోన్ గణ గణ మ్రోగింది. రిసీవర్ అందుకుని మాట్లాడేడు.

ఫోను పెట్టేసి వస్తూ "కుర్చీ అలా ఆరుబయట వెయ్యి....రావాల్సిన మనిషి ఒక అరగంట ఆలస్యంగా వస్తాడట..." అన్నాడు.

కుర్చీ బయట వేశాడు బాబూరావ్.

చల్లటిగాలి వీస్తోంది.

కుర్చీలో కూర్చుని "ఊఁ....చెప్పు"



అన్నాడు.

చేతులు నులుముకుంటూ "మరేం లేదు బాబూ. నా ఇల్లు తాకట్టులో ఉంది. ఇయాలో రేపో ఏలం ఏసేలా ఉన్నారు" అని ఆగిపోయాడు.

'వేలం'—రామనాథానికి నవ్వొచ్చింది. ప్రస్తుతం తన పరిస్థితీ అలాగే ఉంది. తను చేసిన కంట్రాక్టుల్లో ఇంత పెద్ద

దెబ్బ ఎప్పుడూ తినలేదు. ఒకటా రెండా యాభై లక్షల పని! గ్యారంటీ పైము దాటకముందే కొంత కూలిపోయింది. అప్పటికీ అతి త్వరగా రిపేరువర్కు చేయించాడు.

కాపీ—పత్రికలు ఊరుకుంటాయా!

ఫోటోలతో సహా ప్రచారం జరిగిపోయింది.

విషయం అసెంబ్లీ దాకా పాకి పోయింది! ప్రతి పక్షాలు బల్లలు విరగ్గొట్టినంత పాడా విడి చేసి ప్రభుత్వం చేత స్పెషల్ కమిటీ వేయించారు. ఆ కమిటీ కూడా వన్-మెంబర్ది కావటం గుడ్డిలో మెల్ల. ఆ వచ్చే ప్రభువు గురించి ఆరాలు తీసాడు.

ధన మూలం ఇదమ్ జగత్!

'మందు చూపు'కూడా ఉన్నవాడేట.

'పిల్లగాలి'కి పరవశించక పోడట

అయితే—ఎక్కడా పిసరంత పొరబాటు కూడా రాకూడదట. వచ్చిందో దూర్వాసుడి అవతారమేనట.

ఆ సంగతి విన్న తర్వాత కూడగట్టుకున్న ధైర్యం మళ్లీ జారిపోసాగింది ఈ గండం గడిచి బయట పడితే, ఇక కంట్రాక్టుల జోలికి పోకూడదని ఒట్టేసుకున్నాడు. వచ్చిన దాన్ని బ్యాంకులో ఫిక్స్డ్ గా పడేసి, ఆ వచ్చిన వడ్డీ డబ్బుల్తో కాలక్షేపం చెయ్యటం మంచిదిగా తోస్తోంది.

కంట్రాక్టర్లు కోటీశ్వరులయిపోతున్నారని గోలే తప్పితే, ఎదిగే డబ్బుతో బాటు ఎన్నెన్ని సమస్యలు! చివరికి బిల్లులు రాసే గుమాస్తాకి కూడా లోకువగా పడి ఉండాలి. అతన్ని కూడా 'కాకా' పట్టాలి. ఎన్నో స్థాయిల్లో ప్రజ్వలించే ధనదాహానికి నోట్ల నైవేద్యం పెట్టాలి

ఇన్ని చేశాక ఇంక మిగిలేదేముంటుంది? మిగుల్చుకు నేందుకేముంటుంది?

అందుకే కట్టినవి కూలి పోవటం.

అవి కూలుతూ, కంట్రాక్టరు జనం దృష్టిలో హంతకుడంత దుర్మార్గుడై పోతాడు. ప్రజాద్రోహి—దేశద్రోహిలాంటి బిరుదులు పొందుతాడు. ప్రజాధన దుర్వినియోగ యజ్ఞంలో ఋత్విక్కులు కంట్రాక్టర్లు మాత్రమే కాదన్న సత్యం చేసుకోగల వాళ్లెందరు?

"బాబూ...."

రామనాథం ఉలిక్కిపడి తేరుకున్నాడు.

"బయట కారాగింది."

రామనాథం ఆదరా బాదరా పరుగు తీసాడు.

"రండిసార్ రండి..." చక్రవర్తి ముందు సామంత రాజులా స్వాగతం చెబుతూ లోపలికి తీసుకు వచ్చాడు.

"రండిసార్....ఇలా కూర్చోండి...."

చక్రవర్తి కూర్చున్నాడు. (కాకతాళీయంగా అతని పేరు కూడా అదే!)

బాబూరావ్ విశేషానుభవం గల వ్యక్తి గనుక, సునాయాసంగా తనపని చేసుకు పోతున్నాడు.

ఆవిర్లు చిమ్ముతున్న జింజర్ చికెన్.... ఎక్స్ప్ట్రా....ఎక్స్ప్ట్రా.. అందంగా టేబుల్ మీద పరుచుకుని ఉన్నాయి.

"మనిద్దరమేనా?" అసంతృప్తిగా అడిగాడు చక్రవర్తి.

"నోసర్....మరో కంపెనీఉంది" వినయంగా జవాబు చెప్పి, సాభిప్రాయంగా బాబూరావ్ కేసి చూశాడు. వెంటనే తెల్ల మల్లెలా ఉన్న పిల్లని పిలుచు కొచ్చేందుకు తూనీగలా వెళ్లాడు.

ఆ పిల్ల రావటం చూస్తూనే చక్రవర్తి బిగుసుకు పోయాడు.

చేతిలోంచి 'స్పూన్' జారి ప్లేట్లో పడి శబ్దం చేసింది.

"వరితా...నువ్వా?!" అప్రయత్నంగా అనేసాడు చక్రవర్తి.

"చక్రీ నువ్వా!"—ఆమె మంచు పగల గొడుతున్నట్లు మాట్లాడింది.

రామనాథం, బాబూరావ్ హైక్లాసు సినిమా చూస్తున్న లోక్లాసు ప్రేక్షకుల్లా అయోమయంగా ఉండిపోయారు.

"లీవ్ అజ్ ఎలోన్ ఇఫ్ యూ డోంట్ మైండ్" చక్రవర్తి ఆ మాటనగానే

చటుక్కున లేచి "ప్లీజ్...."అంటూ తప్పుకున్నాడు రామనాథం.

"నన్ను కూడా వెళ్లమంటారా!" వినయంగా అడిగాడు బాబూరావ్.

"యస్" అన్నాడు గంభీరంగా.

వర్షన కవసరమైనవన్నీ అందుబాటులో ఉంచి, తలుపులు దగ్గరగాలాగి వెళ్లిపోయాడు బాబూరావ్.

'లాన్'లో అస్థిమితంగా పచార్లు చేస్తున్నాడు రామనాథం.

బాబూరావ్ రాగానే "ఇదెక్కడి గొడవ?" అన్నాడు చిరాగ్గా.

"అదే నాకూ అర్థం కావటం లేదండీ! హైక్లాసు సరుకంటే నాగయ్యగారడిగిన అయిదొందలకీ సరేనన్నాను. మీకు ముందుగా చెప్పాను కదా?" చేతులు నలుపుకుంటున్నాడు బాబూరావ్.

అరచేతిలో పిడికిలి బిగించి గుద్దుకో సాగేడు రామనాథం.

బి. పి. ఎగదన్నినట్లు మొహం జేవురించింది.

'టెన్షన్' మంచిది కాదని డాక్టరు హెచ్చరించాడు తనని.

ఈ కేసు 'సక్సెస్' కాకపోతే, తనకి 'హార్ట్‌ఎటాక్' వచ్చినా విడ్డూరం లేదు.

గాడ్....ఏమిటీ వెధవ జీవితం.

ఎన్నెన్ని సమస్యలు....

చక్రవర్తి, సోకాల్డ్ చరిత, బంధువులా, పాత పరిచయస్థులా....చరిత ఇలాంటి విష వలయంలో ఎలా చిక్కుకుంది? నాగయ్య పట్టే కేసులన్నీ చాలా పెద్దవి. రాజకీయంగా అతని పలుకుబడి కూడా అద్భుతం! అతను 'సప్లయ్' చేసే సరుకులంత గొప్పవిమరి!

'చరితని'—నాగయ్య ట్రాప్ చేసి ఉంటాడా?

కథల్లో మాదిరి నానాహింసలూ పెట్టి దార్లోకి తెచ్చిఉంటాడా?

లేకపోతే బీదరికం భరించలేక చరిత తనకు తానే యీ ఊబిలోకి దూకిందా?

ఏది అసలు కథ?

ఎవరు చెబుతారు! నాగయ్య నడిగి ప్రయోజనంలేదు. ఇవన్నీ అతని ట్రేడ్ సీక్రెట్స్! పూర్వం "ఏరా నాగయ్యా" అనేవాళ్లు సైతం ఇప్పుడు "నాగయ్యగారూ" అనక తప్పటంలేదు, అతని హోదా, డబ్బూ అలా పెరిగిపోయాయి మరి.

కొంపదీసి చక్రవర్తి, అతని కెంతో ప్రియమైన చరితని పతిత రూపంలో వెలయాలుగా నిలబెట్టినందుకు తనమీద పగబట్టడు కదా?

అదే జరిగితే తను మసి అయిపోయినట్లే!

బాబూరావ్ కూడా మనసులో నలిగిపోతున్నాడు. 'అయ్యగారి పనయితే బావుణ్ణు...తనిల్లు వేలంకాకుండా నిలబడుతుంది....ఇల్లువేలం అయిపోతే తనూ, తన పెళ్ళాం పిల్లలూ ఏమైపోవాలి? ఏం జరుగుద్దోమరి' వాడికి పిచ్చెత్తినట్లవుతోంది.

చరిత, చక్రవర్తి ఓ గంట గడిచాక బయట కొచ్చారు.

రామనాథం వాళ్ళని ఆతురతగా సమీపించాడు.

"థాంక్యూ వెరీమచ్ ఫర్ ది నైస్ డిన్నర్! సీమీ టుమారో...." కార్లో చరితని ఎక్కించుకుని వేగంగా దూసుకు పోయాడు చక్రవర్తి.

"ఈ రాత్రంతా నెర్వెస్నెస్‌తో బాధపడాలి కాబోలు...." నిట్టూరుస్తూ అనుకున్నాడు రామనాథం.

"బాబూరావ్! తలుపులు జాగ్రత్తగా వేసుకో.... నేను వెళ్తున్నా" నీరసంగా

కారువైపు నడిచాడు రామనాథం.

ం ం ం

సమయం మూడు కాబోతోంది.

రామనాథం అసహనంగా గడియారం కేసీ, వీధికేసీ చూడసాగాడు.

"ఏమైంది బాబూరావ్ కివ్వాళ?" ఎప్పుడూ నిముషాలతో సహా కరక్టుగా టైముకి వచ్చేవాడు...." తనలోతను మథన పడసాగాడు.

నిరీక్షణ అతని సహనాన్ని పూర్తిగా హరించాక వచ్చాడు బాబూరావ్,

అదికూడా — మనిషి అదోలా, వ్యాధి పీడితునిలా, కలలో నడుస్తున్నట్టు....

రామనాథం ఆవేశంగా పెద్ద పెద్ద కేకలు వేశాడు.

చెవిటివాడిలాగా నిలబడి అంతా మౌనంగా విన్నాడు బాబూరావ్.

మాటల్లో రామనాథం పని అనుకూలంగా అయినట్లు, చక్రవర్తికి చెయ్యాల్సిన మర్యాదలకి తన ఆలస్యం వల్ల ఇబ్బందికలిగినట్లు అర్థమయింది బాబూరావ్‌కి. చివరికి విరక్తిగా నవ్వి, "బాబూ తమరిల్లు నిలబడింది. నాకొంప యాలం అయిపోయింది. సమయానికి అయిదొందల్రూపాయలిస్తే నేను ఒడ్డున పడేవోణ్ణి. కూలివాడికష్టం తెలియని దొరల దగ్గర నౌకరీ చేసే కంటే ఆకలితో మాడి చావటం మేలు. మీ లచ్చలు మీరే ఉంచుకోండి. నా పిల్లలు చెట్టుకింద నిలబడి నాకోసం చూస్తున్నారు. నే వస్తా బాబూ. మాట మాత్రం చెప్పలేదను కుంటారని వచ్చా.... మళ్ళీ నాకోసం కబురెట్టకండి... మీరు కబురంపినా నే వచ్చేది లేదు...."

రామనాథం రాయిలా అలాగే నిలబడి అంతకంతకూ దూరమవుతున్న బాబూరావ్‌కేసి చూస్తుండి పోయాడు.

